ప్రజాశక్తి

శుక్రవారం 26 మే 2023 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

పాముకాటుతో కానిస్టేబుల్ మృతి

నివాళులర్పించిన ఎస్‌పి, జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి



బాధిత కుటుంబాన్ని ఓదార్చుతున్న ఎస్‌పి మల్లిక గర్గ్

ప్రజాశక్తి-చీమకుర్తి

తాళ్ళూరు పోలీసుస్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఇరిగినబోయిన పవన్ కుమార్(32) పాముకాటుతో గురువారం మృతి చెందాడు. అందిన వివరాల ప్రకారం... 2011 బ్యాచ్‌కు చెందిన పవన్‌కుమార్ తాళ్ళూరు, ఒంగోలు, ముండ్లమూరు పోలీసుస్టేషన్లలో విధులు నిర్వహించాడు. ఇటీవల తాళ్ళూరు పోలీసు్‌స్టేసన్‌కు బదిలీ అయ్యాడు. సౌమ్యుడుగా ఉంటూ విధులు నిర్వహించడంలో అందర్ని మన్నలు పొందాడు. అమరావతి భూములలో పేదలకు పట్టాల పంపిణీ నేపథ్యంలో లేఅవుట్ పనుల కోసం ప్రవన్‌కుమార్ అక్కడ బందోబస్త్ డ్యూటీ వేశారు. అందులో భాగంగా తుళ్ళూరు మండలం అనంతవరం గ్రామంలోని ఓ దేవాలయంలో తోటి పోలీసులతో కలిసి సోమవారం రాత్రి నిద్రిస్తుండగా పాము రెండు సార్లుగా కాటేసింది. తోటి

తెలంగాణ ఎంసెట్ ఫలితాలలో చీరాల విద్యార్థికి

రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు



వెంకట తేజ

ప్రజాశక్తి - చీరాల

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎంసెట్ ఫలితాలలో బాపట్ల జిల్లా, చీరాల మండలం, దేవాంగపురి పంచాయతీకి చెందిన నాసిక వెంకట తేజ తెలంగాణ రాష్ట్ర స్థాయిలో సెకండ్ ర్యాంకు సాధించాడు. దేవాంగపురిలో నివాసం ఉంటున్న చేనేత కార్మికులు సుధాకర్ బాబు, శ్రీదేవి దంపతుల కుమారుడు నాసిక వెంకట తేజ పదవతరగతి కరోనా సమయంలో పాసైయ్యాడు. ఇంటర్మీడియట్ శ్రీచైతన్యలో చదివి 986 మార్కులు సాధించాడు. తెలంగాణ రాష్ట్ర ఎంసెట్ ఫలితాలలో సెకండ్ ర్యాంకు సాధించాడు. నాసిక వెంకట తేజ రెండో ర్యాంకు సాధిం చడం పట్ల చీరాల ప్రాంత వాసులందరూ హర్షం వ్యక్తం చేశారు. వెంకట తేజకు అభినందనలు తెలిపారు.

ఫలితాలు వచ్చినా.. పైసలు రాక..

- రెమ్యూనరేషన్ చెల్లింపులో జాప్యం
- ఉపాధ్యాయుల నిరీక్షణ



పదో తరగతి పరీక్ష పేపర్లు దిద్దుతున్న ఉపాధ్యాయులు (ఫైల్)

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

పదో తరగతి పబ్లిక్ పరీక్షల మూల్యాంకనం చేసిన ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ చెల్లింపులో జాప్యం జరుగుతోంది. మూల్యాంకనం ముగిసి ఫలితాలూ వెలువడ్డాయి. మరో వారంలో అడ్వాన్స్ పబ్లిక్ పరీక్షలు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖలోని పరీక్షల విభాగం సన్నద్ధమవుతోంది. అయినప్పటికీ నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. దీంతో డబ్బులు ఎప్పుడిస్తారా అని ఉపాధ్యాయులు వేయి కళ్లతో నిరీక్షిస్తున్నారు.

గత నెల 19 నుంచి 26 వరకు జిల్లాలో పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం చేశారు. సమాధాన పత్రాలు ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు 2.17 లక్షలు వచ్చాయి. వీటిని మూల్యాంకనం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా 1,300 మంది ఉపాధ్యాయులను నియమించారు. సబ్జెక్టుల వారీగా విభజించి ప్రతిరోజు 40 సమాధాన పత్రాలు ఒక్కో ఉపాధ్యాయుడు దిద్దారు. ఒక్కో పత్రానికి రూ.10 చొప్పున చెల్లించాలి. దీంతో పాటు రవాణా, కరవు భత్యం కూడా చెల్లించాలి. సహజంగా మూల్యాంకనం ముగిసిన మరుసటి రోజు గానీ, వారం రోజులలోపు రెమ్యునరేషన్ చెల్లిస్తారు. మూల్యాంకనం ముగిసి దాదాపు నెల రోజులవుతున్నా ఇంకా ఉపాధ్యాయుల బ్యాంకు ఖాతాలో ఆ డబ్బులు జమ కాకపోవడం గమనార్హం.

పాత బిల్లా..కొత్త బిల్లా..?

పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన రెమ్యునరేషన్ పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. అయితే జవాబు పత్రాల దిద్దుడు కార్యక్రమంలో పాత బిల్లు చెల్లిస్తారా, కొత్త ఉత్తర్వుల ప్రకారం ఇస్తారా అనే విషయం తెలియడం లేదు. గతేడాది వరకు ఒక్కో జవాబు పత్రానికి రూ.6.60 చెల్లించే వారు. ప్రస్తుతం పెరిగిన ధరల ప్రకారం రూ. 10 చెల్లించాలి. మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయుల నుంచి రెండేసి బిల్లులు స్వీకరించారు. పాత ధర రూ.6.60 ప్రకారం, కొత్త ధర రూ.10 ప్రకారం వేర్వేరుగా బిల్లులు విద్యా శాఖ తీసుకుంది. ఇప్పటి వరకు ఏ బిల్లు ప్రకారం చెల్లించాలనేది అధికారుల్లోనే స్పష్టత లేదు. ఒక్కో ఉపాధ్యాయుడికి రూ.5 వేల నుంచి రూ. 7 వేల వరకు నగదు చెల్లించాల్సి ఉంటుంది.

నిధులు రాగానే చెల్లిస్తాం

కె శివకుమార్, సహాయ కమిషనర్, పరీక్షల విభాగం, ఒంగోలు

పదో తరగతి మూల్యాంకనానికి సంబంధించి పాత బిల్లులు రూ. 6.60 ప్రకారం చెల్లిస్తున్నాం. మొత్తం బిల్లులు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాం. ఇంకా నిధులు రావాల్సి ఉంది. వచ్చిన వెంటనే చెల్లిస్తాం. ఆ తర్వాత కొత్త బిల్లులు ప్రకారం తిరిగి మిగతావి చెల్లించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే ఖాతాల్లో జమ చేస్తాం.

ఉధృతంగా ఈదురు గాలులు


- పలుచోట్ల రోడ్లపై కూలిన చెట్లు
- ట్రాఫిక్‌కు, విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

మధ్యాహ్నం వరకూ ఎండతీవ్రంగానే కాచింది. జనం ఎండలకు ఉక్కిరిబిక్కిరయ్యారు. జిల్లాలో 39 నుంచి 40 డిగ్రీల ఎండ నమోదైంది. ఆ తర్వాత వెంటనే వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమైంది. ఉరుములు మెరుపులతో బలమైన ఈదురు గాలులు వీచాయి. అక్కడక్కడా చిరు జల్లులు కూడా పడ్డాయి. ఈదురు గాలులకు రోడ్లపై చెట్లు విరిగిపడిపోయాయి. కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. అక్కడక్కడా విద్యుత్ తీగెలు తెగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మధ్యాహ్నం నుంచి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పలుచోట్ల ఈదురగాలులకు చెట్లు పడిపోవడంతో జనజీవనానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. గంటల తరబడి కరెంటు సరఫరా ఆగిపోయింది. విద్యుత్‌శాఖ అధికారులు పునరుద్దరణచర్యలు చేపట్టారు. చీరాలలో మధ్యాహ్నం నుంచే కరెంటు లేదు. ఒంగోలుకు చుట్టుపక్కల మండలాల్లోనూ కరెంటు నిలిచిపోయింది. గాలులు బలంగా వీచాయి.కరెంటు సరఫరా ఆగిపోవడంతో ఆసుపత్రుల్లో రోగులు సైతం ఇబ్బందులు పడ్డారు. అత్యవసర విభాగాల్లోనూ కరెంటు కష్టాలు తప్పలేదు. గంటలపాటు మండలాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.



సంతమాగులూరులో రహదారిపై కూలిన చెట్టు



వేటపాలెంలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం

ఎన్నికల రంగంలోకి ఐప్యాక్ టీమ్

- అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆరా
- వైసిపి బలాలు, బలహీనతలపై సమీక్ష

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

అధికార వైసిపి తరపున ఎన్నికల వ్యూహాలు రచిస్తున్న ఐప్యాక్ టీమ్ రాజకీయ కార్యాచరణలోకి దిగింది. ఏడాదిగా నియోజకవర్గాల వారీగా వైసిపి తరపున బలమైన అభ్యర్థులను కోసం సర్వే చేసి పార్టీ అధినేతకు సూచనలు చేస్తూ వచ్చిన ఐప్యాక్ సభ్యులు ఇప్పుడు నేరుగా ఎన్నికల బరిలోకి దిగారు. బాపట్లలోని వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్లు, ఆరు నియోజకవర్గాల్లోని ఎమ్మెల్యేలు ఇన్‌ఛార్జులతో కలిసి గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఓ ప్రైవేట్ హోటల్‌లో ఇష్టాగోష్టిగా నిర్వహించిన సమావేశంలో జిల్లాలో వైసిపికి ఉన్న బలాలు, బలహీనతల గురించి చర్చించారు. వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్లు భూమన కరుణాకర రెడ్డి, బీద మస్తాన్ రావు, మంత్రి మేరుగు నాగార్జున రాష్ట ప్రభుత్వం గడచిన నాలుగేళ్ల చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు మాట్లాడుతూ సచివాలయ , వాలంటీర్ల వ్యవస్థ కారణంగా పార్టీ నేతలు ప్రజలకు దూరమైనట్లు తెలిపారు. కొన్ని చోట్ల సచివాలయ సిబ్బంది దురుసు ప్రవర్తన, విధులు సక్రమంగా నిర్వర్తించని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు ఐప్యాక్ టీం దృష్టికి తీసుకెళ్లారు. వైసిపి ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులు వివక్షతకు గురయ్యారని, కొందరిపై కోపంతో అందరికి అన్యాయం జరిగినట్లు తెలిపారు. రాష్టంలో అందరి సంక్షేమం కోసం కృషి చేశామని చెబుతున్న నేతలు జర్నలిస్టుల కోసం ఏమి చేశారో చెప్పాలన్నారు. రాష్ట ప్రభుత్వం నుంచి జర్నలిస్టులకు కరోనా సాయం కూడా అందలేదన్నారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయాలన్నారు. అక్రిడేషన్లలో కోత పెట్టడం సరికాదన్నారు.దీంతో ఐప్యాక్ మాట్లాడుతూ జర్నలిస్టు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. రానున్న ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించనున్న ఐప్యాక్ సభ్యులు వైసిపి అభ్యర్థుల ఖారారు. క్షేత్రస్థాయిలో రాజకీయ వ్యూహాల రచనలతో వ్యవస్థలను వైసిపికి అనుకూలంగా మలిచే కార్యక్ర ˘మాలకు శ్రీకారం చుట్టినట్లు తెలుస్తుంది.ఐప్యాక్ నేతృత్వంలో నిర్వహించిన సమావేశానికి వైసిపికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్న పత్రికలు, మీడియా ప్రతినిధులను ఆహ్వానించలేదు. ఈ సమావేశంలో బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ పోతుల సునీత, వైసిపి చీరాల, పర్చూరు, అద్దంకి నియోజ వర్గాల ఇన్‌ఛార్జులు కరణం వెంకటేష్, ఆమంచి కృష్ణమోహన్, బాచిన కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.



లైఫ్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభం

పాముకాటుతో కానిస్టేబుల్ మృతి

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు అప్రమత్తమై గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. పవన్‌కుమార్ భౌతిక కాయాన్ని స్వగ్రామమైన చీమకుర్తిలోని దిన్నేపురానికి తరలించారు.

నివాళులర్పించిన ఎస్‌పి మల్లికగర్గ్

పవన్‌కుమార్ భౌతికకాయాన్ని ఎస్‌పి మల్లిక గర్గ్ సందర్శించి నివాళులర్పించారు. అదేవిధంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎమ్మెల్యే సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, దర్శి డిఎస్‌పి అశోక్‌వర్ధన్, ఒంగోలు డిఎస్‌పి నారాయణ స్వామిరెడ్డి, సిఐలు శ్రీనివాసులరెడ్డి, రామకోటయ్య, ఎస్‌ఐలు ప్రేమ్‌కుమార్, ఎస్‌ఐ రామిరెడ్డి తదితరులు పవన్‌కుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పోలీసు అంటే పవన్‌కు ఇష్టం

చిన్నతనం నుంచే పోలీసు కావాలన్నదే పవన్‌కుమార్ లక్ష్యం. తండ్రి ఆర్‌టిసి డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో పవన్‌కుమార్ పట్టుదలగా చదివి 2011లో కానిస్టేబుల్ ఎంపికయ్యాడు. సమీప బంధువుల అమ్మాయితో వివాహమైంది. ఇద్దరు సంతానం ఉన్నారు. అందిరితో కలివిగా ఉంటూ తలలో నాలుకలా ఉండే పవన్‌కుమార్ మృతి చెందాడని తెలిసి కుటుంబం సభ్యులు, బంధు మిత్రులు, స్నేహితులు కన్నీటి పర్యంతమయ్యారు. గురువారం సాయంత్రం పోలీసు లాంఛనాలతో పవన్‌కుమార్ అంత్యక్రియలు నిర్వహించారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

వేమూరు : వేమూరు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో జీలుగ, జనుము విత్తనాలు 50 శాతం రాయితీతో అందుబాటులో వున్నాయని మండల వ్యవసాయాధికారి సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జీలుగ విత్తనాలు ఎకరానికి 10 కిలోలు, జనుము ఎకరానికి 8 కిలోలు చొప్పున ఇవ్వనున్నట్లు తెలిపారు. 50 శాతం రాయితీతో రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

గృహ నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు మండల పరిధిలోని ప్రభుత్వం అందించిన జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణాలను ప్రారంభించని వారికి నోటీసులు ఇవ్వనున్నట్లు తహశీల్దారు శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జరిగిన లబ్ధిదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటి నిర్మాణాలు ప్రారంభించని వారికి నోటీసులు ఇవ్వనున్నట్లు చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో సత్యనారాయణ వాలంటీర్లు ఉన్నారు.

ప్రజాశక్తి-చీరాల

పట్టణంలోని ఏరియా వైద్యశాల ప్రధాన రహదారిలో డాక్టర్ సజ్జా చంద్రమౌళి మెమోరియల్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన లైఫ్ మల్టీ స్పెషలిటీ క్లినిక్‌ను గురువారం శాసనసభ్యులు కరణం బలరాం కృష్ణమూర్తి, నియోజకవర్గం వైసీపీ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే, శాసనమండలి సభ్యులు సజ్జా చంద్రమౌళికి, తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని, ఆయన చీరాలలో మంచి పేరున్న వైద్యులు అని అన్నారు. ఆయన వారసులు సజ్జా రవీంద్రనాథ్ బాబు, కోడలు సజ్జా హేమలత, కళ్యాణ్ చక్రవర్తి, అనూష, సజ్జా చంద్రమౌళి మెమోరియల్ ఆధ్వర్యంలో లైఫ్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌ను చీరాలలో ప్రారంభించడం అభినందించదగిన విషయం అన్నారు. ఈ సందర్భంగా పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే సంకల్పంతో చీరాల ప్రాంతంలో క్లినిక్ ప్రారంభించారని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సజ్జా రవీంద్రబాబు, సజ్జా హేమలత, కళ్యాణ్ చక్రవర్తి, అనూష, శ్వేత, మౌనిష్, చీరాల మునిసిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఉమామోహన్, డాక్టర్ భవాని ప్రసాద్, వైస్ చైర్మన్ బోనిగల జైసన్ బాబు, వైస్ చైర్మన్ శిఖాకొల్లి రామసుబ్బులు, కౌన్సిలర్ బత్తుల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



లైఫ్ మల్టీ స్పెషాలిటీ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలరాం



కృష్ణ మాదిగతో నాయకులు

కృష్ణ మాదిగను కలిసిన పలువురు నాయకులు

ప్రజాశక్తి-బాపట్ల

యద్దనపూడి దళితుల సమస్యలపై జిల్లా కేంద్రమైన బాపట్లకి విచ్చేసిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కష్ణ మాదిగను పలువురు ఎమ్మార్పీఎస్ వైసిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం బాపట్ల కు వచ్చిన కష్ణ మాదిగను పలువురు వైసిపి, ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ మాదిగను సన్మానించారు. కృష్ణ మాదిగను కలిసిన వారిలో ఇనగలూరు మాల్యాద్రి, కేర్ మినిస్ట్రీస్ నిర్వాహకులు మోపర్తి జాన్, బీసీ, బడుగు బలహీన వర్గాల సంఘాల నాయకులు ఉన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలు

25వ రోజు మజ్జిగ చలివేంద్రం

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక మెయిన్ సెంటర్లో వాసవి క్లబ్స్, ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ వారి ఆధ్వర్యంలో గురువారం 25వ రోజు మజ్జిగ చలివేంద్రం దిగ్విజయంగా కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ పి వెంకటనారాయణ మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలు తమ కంపెనీ తరపున చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య బిర్లా సన్ లైఫ్ ఇన్సూరెన్స్ మోస్ట్ రెస్పెక్ట్ అడ్వైజర్ కే నాగమల్లేశ్వరరావు, వాసవి క్లబ్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి సురేష్

వధూవరులకు మంత్రి ఆశీర్వాదం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఎస్‌ఆర్‌ఆర్ ఛానల్ బ్యూరో ఇన్‌ఛార్జి మందా ప్రశాంత్ వివాహ వేడుకలు మండల పరిధిలోని హసనబాద్ గ్రామంలో గురువారం నిర్వహించారు. ఈ వేడుకల్లో మంత్రి సురేష్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు కూడా వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్రగాయాలు
- మూడో వ్యక్తి పరార్

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

ముందు వెళుతున్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడిన ఘటన మార్టూరు సమీపంలోని శ్రీ దుర్గా మల్లేశ్వరి దేవస్థానం ఎదురుగా గురువారం వేకువజామున జరిగింది. హైవే పెట్రోలింగ్ సిబ్బంది కథనం ప్రకారం.. విజయవాడ పండ్ల మార్కెట్‌కు చెందిన శ్రీకాంత్, బాబీ గురునాథంతో కలిసి దరిశిలో జరిగిన కొలుపులకు బుధవారం హాజరై తిరిగి విజయవాడకు బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న కారు మార్టూరు-రాజుపాలెం మధ్య జాతీయ రహదారిపై ముందు వెళుతున్న లారీ ఒక్కసారిగా నెమ్మదించడంతో కారుని అదుపు చేయలేక బలంగా ఢీకొట్టారు. దీంతో కారులో ముందు కూర్చున్న శ్రీకాంత్, డ్రైవర్ బాబీ తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం అనంతరం లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. వాహన దారులు ఇచ్చిన సమాచారం అందుకున్న ఎడ్లపాడు 108 సిబ్బంది శ్రీకాంత్ ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను గుంటూరు సర్వజన సమగ్ర వైద్యశాలకు తరలించారు. తీవ్రంగా గాయపడ్డ బాబీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మార్టూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శభాష్ లారీ డ్రైవర్

ప్రమాదం వేకువజామున 4 గంటల ప్రాంతంలో జరగడంతో కారులో ఇరుక్కుపోయి ఆర్తనాదాలు చేస్తున్న వీరిని కొద్దిసేపు ఎవరూ గమనించలేదు. వెనుకనే వస్తున్న వాహనదారులు చూస్తూ వెళుతున్నారే తప్ప కారులోని వ్యక్తులను కాపాడే ప్రయత్నం చేయలేదు. అదే సమయానికి విజయవాడ నుంచి చెన్నై వెళుతున్న లారీ సిబ్బంది ప్రమాదాన్ని గుర్తించి కారులో ఇరుక్కుపోయి తీవ్రంగా గాయపడిన ఇద్దరు వ్యక్తులను బయటకు తీసి, తమ సెల్ ఫోన్ లైట్ ద్వారా ఇతర వాహనాలు ఆగిఉన్న కారుని తిరిగి ఢీ కొట్టకుండా పోలీసులు వచ్చేవరకు ట్రాఫిక్‌ని కంట్రోల్ చేశారు. వీరి కృషిని పలువురు ప్రశంసించారు.



ప్రమాదంలో గాయపడినవారు, నుజ్జు నుజ్జయిన కారు

ప్రమాదం అనంతరం కారులోని వ్యక్తి పరార్..

కారు లారీని ఢీకొన్న వెంటనే ఎటువంటి గాయాలు లేని విజయవాడకు చెందిన మూడో వ్యక్తి గురునాథం తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు వ్యక్తులను కారులోనే వదిలేసి ఎటువంటి సహాయక చర్యలు చేపట్టకుండా, ఎవరికీ సమాచారం ఇవ్వకుండా అక్కడి నుంచి పరారవడం పలు అనుమానాలకు తావిచ్చింది. జరిగిన ఘటనపై పోలీసులు సమగ్ర దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు అంటున్నారు.

వ్యక్తి అస్థిపంజరం లభ్యం

ప్రజాశక్తి-బేస్తవారిపేట

మండలంలోని పిటికాయగుల్ల, ఖాజీపురం మరియు పందిళ్లపల్లి గ్రామాల మధ్య గల అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి అస్థిపంజరం లభ్యమైనట్లు ఎస్ఐ మాధవరావు తెలిపారు. సుమారు 40-50 సంవత్సరాల మధ్య వయస్సు గల ఒక మగ మనిషి ఎముకలతో కూడిన అస్థి పంజరాన్ని కొందరు పశువుల కాపరులు గుర్తించి సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. మృతదేహం పక్కన ఎరుపు, నలుపు రంగులు గల టవల్, ఆకుపచ్చ రంగు డిజైన్ గల లుంగీ, తెలుపు రంగు నిండు చేతుల చొక్కా, నలుపు రంగు ప్లాస్టిక్ చెప్పులు ఉన్నాయని తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ సమీప గ్రామాలలో తప్పిపోయిన వ్యక్తుల వివరాలు, లేదా సదరు గుర్తు తెలియని అస్థిపంజరం వివరాలు ఎవరికైనా తెలిసినచో తన ఫోన్ నెంబర్ 9121102189కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉపాధి కూలీల ఆటో బోల్తా

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం బురుజుపల్లి గ్రామంలో ఉపాధి కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. మరో 13 మందికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ ఇద్దరినీ గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు.

డిసిఎంను ఢీకొట్టిన మినీ వాహనం

ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

డిసిఎం వాహనాన్ని మినీ వాహనం ఢీకొన్న ఘటనలో ఆరుగురుకి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన యర్రగొండపాలెం సమీపంలోని మిల్లంపల్లి టోల్‌ప్లాజా వద్ద గురువారం చోటు చేసుకుంది. పల్నాడు జిల్లా గురజాలకు చెందిన కొందరు నంద్యాల జిల్లా ఆత్మకూరులో జరిగిని వివాహ వేడుకలకు హాజరై తిరిగి గురజాలకు బయలుదేరారు. ఎండ అధికంగా ఉండడంతో యర్రగొండపాలెం సమీపంలోని మిల్లంపల్లి టోల్‌ప్లాజా వద్ద తమ వాహనాన్ని ఆపి సేద తీర్చుకుంటున్నారు. అదే సమయంలో విత్తనాల కంపెనీకి చెందిన వాహనం వేగంగా వచ్చి ఆగున్న వాహనాన్ని ఢీకొంది. దీంతో ఆరుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను యర్రగొండపాలెంలోని ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో సచివాలయ ఉద్యోగి మృతి

ప్రజాశక్తి-కంభం రూరల్



భూమా రామకృష్ణారెడ్డి (ఫైల్)

మాగుటూరు గ్రామ సెరికల్చర్ సచివాలయ అసిస్టెంట్‌గా పని చేస్తున్న భూమా రామ కృష్ణారెడ్డి(25) బుధవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో అతని గదిలో మృతి చెందాడు. ముండ్ల మూరు మండలం వేములకు చెందిన రామకృష్ణారెడ్డి ఇక్కడ రెండేళ్లుగా సెరికల్చర్ అసిస్టెంట్ గా పని చేస్తున్నాడు. నెల రోజుల కింద అతని ప్రొబెషనరీ పీరియడ్ పూర్తయిందని సమాచారం. అతని తండ్రికి ముగ్గురు కుమారులు కాగా రామకృష్ణారెడ్డి మొదటి సంతానం. రామకృష్ణారెడ్డికి పుట్టుకతో పోలియో ఉంది. అతడు కంభంలోని యూనియన్ బ్యాంక్ ఎదురుగా ఉన్న ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. బుధవారం తనకు ఆరోగ్యం బాగాలేదని సెలవు పెట్టినట్టు తెలిసింది. బుధవారం రాత్రి రామకృష్ణారెడ్డికి అతని తల్లిదండ్రులు ఫోన్ చేసినప్పటికీ ఫోను లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి వారు ఇంటి ఓనర్‌కు కాల్ చేసి రామకృష్ణా రెడ్డికి సమాచారం ఇవ్వమని కోరగా ఇంటి ఓనరు అతని రూము వద్దకెళ్లి కిటికీల నుంచి చూడగా అప్పటికే అతను అచే తనంగా పడి ఉన్నాడని సమా చారం. రామకృష్ణారెడ్డి ఫిట్స్ వల్ల గాని, లేదా గుండెపోటు వల్ల గాని మృతి చెంది ఉండవచ్చని భావి స్తున్నారు. రామకృష్ణారెడ్డి చిన్న తమ్ముడికి కూడా పుట్టుకతో పోలియో ఉందని, అతను కూడా ఇదేవిధంగా ఇంట్లోనే మృతి చెందినట్లు సమాచారం. కంభం ప్రభుత్వ వైద్య శాలలో గురువారం రామకృష్ణారెడ్డి మృతదేహా నికి పోస్టుమార్టం నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. మండల వ్యవసాయాధికారి మొహమ్మద్, వారి సిబ్బంది వచ్చి రామకృష్ణారెడ్డి మృతదేహాన్ని సందర్శించి అతని తల్లిదండ్రులను పరామర్శించారు. ఎస్ఐ వి నాగమల్లేశ్వరరావు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.



స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్లతో సెబ్ సిఐ శ్రీనివాసులు

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

ప్రజాశక్తి-బాపట్ల

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను గురువారం సెబ్ సిఐ శ్రీనివాసులు స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల మండలం కుక్కలవారిపాలెం వద్ద స్వాధీనం చేసుకున్న రెండు ఇసుక ట్రాక్టర్లను బాపట్ల రూరల్ పోలీసులకు అప్పగించిననట్లు శ్రీనివాసులు తెలిపారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న బైకు.. ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్



ప్రమాదంలో గాయపడిన వ్యక్తి

ట్రాక్టర్‌ను బైకు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని కొప్పెరపాడు శివాలయం ఎదురు అద్దంకి నార్కెట్‌పల్లి రహదారిపై గురువారం సాయంత్రం జరిగింది. అద్దంకి మండలం కొత్తపల్లికి చెందిన కొప్పరావూరి సమంత్, కుందుర్తి శ్రీను ఇద్దరు కొప్పెరపాడు శివాలయం సమీపంలో వైదన వైపు నుంచి కొత్తపల్లికి బైకుపై వెళుతున్నారు. ముందుగా వెళుతున్న వ్యవసాయ ట్రాక్టర్‌కి ఉన్న గొర్రును వెనక నుంచి బలంగా ఢీకొట్టడంతో సుమంత్ ఎడమ మోకాలు కింది భాగం విరిగింది. మూతికి కూడా బలమైన దెబ్బ తగలడంతో పళ్లు కూడా విరిగిపోయాయి. బైకు వెనకవైపు ఉన్న శ్రీనుకి స్వల్ప గాయాలు అయ్యాయి. కొప్పెరపాడు వైపు వెళుతున్న బల్లికురవ మండలంలో వైఎస్ఆర్ క్రాంతి పథంలో పనిచేస్తున్న వికలాంగుల అధ్యక్షుడు దమ్ము అంజయ్య ఇంటికి వెళుతున్న నేపథ్యంలో చూసి హైవే అంబులెన్స్‌కు కాల్ చేశారు. అద్దంకి ప్రభుత్వ హాస్పిటల్‌కి పంపించారు. క్షతగాత్రుల తల్లిదండ్రులకు సమాచారం తెలియజేశారు.

అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం ముందంజ: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీజేఆర్

నాలుగు సంవత్సరాల వైసిపి పాలనలో అభివృద్ధి సంక్షేమంలో రాష్ట్రం ముందంజలో ఉన్నట్లు స్థానిక శాసనసభ్యులు టీజేఆర్ సుధాకర్‌బాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై అనంతరం ప్రసంగించారు. సమావేశానికి ఎంపీపీ బుడంగుంట విజయ అధ్యక్షత వహించారు. ఎంఎల్ఏ టీజేఆర్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. ముఖ్యంగా అవినీతికి తావు లేకుండా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందించినట్లు తెలిపారు. దీనిపై ఓర్వలేని చంద్రబాబు ఎల్లో మీడియా రకరకాల కుయుక్తులతో విమర్శలు చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. సంతనూతలపాడు నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి సంక్షేమం ముందంజలో నిలిచిందన్నారు. సంతనూతలపాడు మండలంలో అన్ని రంగాలలో అభివృద్ధి జరిగిందన్నారు. సమావేశంలో ముందుగా పలు శాఖల పనితీరుపై సమీక్షించారు. సమావేశంలో జడ్పీటీసీ దుంపా రమణమ్మ వైసీపి మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, ఎంపిడీఓ రాఘవేంద్ర సీడీపీఓ ఇవాంజిలిన్, తహశీల్దారు కేఆర్ భూపతి, పీఆర్ ఏఈ రవిబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వాలిబాబు, వెలుగు ఏపీఎం సుధాకరరావు, ఏఓ పావని పశువైద్యాధికారి ప్రతాపరెడ్డి, ఎంఈఓ సనత్‌కుమార్, వైద్యాధికారులు నాగరాజు, సుమన్ కుమార్, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.



సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సాఫ్ట్ బాల్ పోటీలకు మైనంపాడు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

రాష్ట్రస్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగు బాలికలు, ఒక బాలుడు మొత్తం ఏడుగురు విద్యార్థులు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు మాబు సుభాని తెలిపారు. ఇటీవల ఒంగోలు మినీ స్టేడియంలో జరిగిన ఎంపికల్లో తమ పాఠశాలకు చెందిన పి పూజిత, ఎస్‌కె కమ్రున్, డి అంజనాదేవి, వి వైష్ణవి, ఏ సుహార్షిత, నాగవేణి, బాలురు నుంచి కే బాలాజీ అనే విద్యార్థులు మెరుగైన ప్రతిభ కనపరచడంతో నిర్వాహకులు జూనియర్ జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్టు చెప్పారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26 నుంచి 28 వరకు అన్నమయ్య జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని స్కూల్ పీడి కే వనజ తెలియజేశారు. ఈ ఎంపిక పట్ల మైనంపాడు హాకీ క్లబ్ అధ్యక్షులు గొడుగు కాలేషా, విద్యా కమిటీ చైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, స్కూల్ స్టాఫ్ ఏడుకొండలు హర్షం వ్యక్తం చేశారు.



కోన శ్రీనివాసరావును అభినందిస్తున్న మోపిదేవి శ్రీనివాసరావు

కోనా శ్రీనివాసరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి-రేపల్లె: సేవా రంగంలో విశేష సేవలు అందించినందుకు డాక్టరేట్ లభించటం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకులు మోపిదేవి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం డాక్టరేట్ అందుకున్న కోన శ్రీనివాసరావును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు సేవా రంగాలను ఎంచుకుని గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి సిహెచ్ మణిలాల్, చెన్నుపల్లివారిపాలెం సర్పంచ్ ముత్తిరెడ్డి జయరామయ్య, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.




అన్నదాన కార్యక్రమం సందర్భంగా నిర్వాహకులు

వృద్ధులకు అన్నదానం

ప్రజాశక్తి-అద్దంకి

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ అద్దంకి ఆధ్వర్యంలో పాటిబండ్ల వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం, వారి కుమారుడు పాటిబండ్ల రంగారావు (క్రాంతి రంగారావు) సౌజన్యంతో, సింగరకొండ శ్రీరామ వృద్ధుల ఆశ్రమంలో అన్నదాన కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు, కోశాధికారి శ్రీనివాసరావు, రోటరీ సభ్యులు పిఎల్‌వి నరసింహారావు దంపతులు, అద్దంకి లేవి ప్రసాద్, ఉరిటి శ్రీనివాసరావు, ఊటుకూరు రామకోటేశ్వరరావు, నర్రా శ్రీలక్ష్మి, జాగర్లమూడి శివ కుమారి, కార్యక్రమ దాత పాటిబండ్ల రంగారావు దంపతులు, ఆశ్రమ నిర్వాహకులు, ఆశ్రమంలోని వృద్ధులు పాల్గొన్నారు. ఈ సందరంగా జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ వద్ధులకు అన్నదానం చేయటం ఎంతో పవిత్రమైన కార్యక్రమం అని, అందుకు సహకరించిన రంగారావు దంపతులు అభినందనీయులని పేర్కొన్నారు. కార్యక్రమం అనంతరం రంగారావు దంపతులను రోటరీ వారు ఘనంగా సత్కరించారు.



మార్టును ప్రారంభిస్తున్న ఎంపీ మోపిదేవి

చేయూత మహిళా మార్టు ప్రారంభం

ప్రజాశక్తి-రేపల్లె: మహిళల ఆర్థిక అభివృద్ధికి చేయూత మహిళా మార్టులు దోహదపడతాయని ఎంపీ మోపిదేవి వెంకటరమణరావు అన్నారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలనే ఆశయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టారని ఎంపీ మోపిదేవి వెంకట రమణరావు తెలిపారు. పట్టణంలోని ఓపెన్ థియేటర్‌లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేయూత మహిళ మార్టును గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించాలని లక్ష్యంతో మార్టులను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టులో నిత్యావసర సరుకులను కొనుగోలు చేసి వారి ఆర్థికాభివృద్ధికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లిఖార్జునరావు, పట్టణ అధ్యకులు గడ్డం రాధాకృష్ణమూర్తి, రూరల్ మండల అధ్యక్షులు గాదె వెంకయ్య బాబు, ఆర్డిఓ జగన్నాథం పార్థసారథి, తహశీల్దారు మల్లికార్జునరావు, వైసీపీ నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఘనమైన చరిత్రకు సజీవ సాక్ష్యం..

బాపట్ల టౌన్ హాల్‌కు 118 వసంతాలు పూర్తి

ప్రజాశక్తి-బాపట్ల

స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో మరువలేని ఘట్టాలకు బాపట్ల టౌన్‌హాల్ వేదికగా నిలిచింది. ఘనమైన చరిత్రకు సజీవ సాక్ష్యంగా బాపట్ల టౌన్ హాల్ ఆవిర్భవించింది. ఈ నెల 26న ప్రథమాంధ్ర మహాసభల వార్షికోత్సవం సందర్భంగా ప్రజాశక్తి అందిస్తున్న ప్రత్యేక సంక్షిప్త కథనం. ఈ టౌన్‌హాల్ నిర్మించి 118 సంవత్సరాలు పూర్తయింది. కీలకమైన, చారిత్రాత్మకమైన ఘట్టాలకు ప్రధాన వేదికైన బాపట్ల టౌన్ హాల్లో 1913లో ప్రథమాంధ్ర మహాసభలు జరిగాయి. ఎన్నో స్వాతంత్ర్య పోరాటాలకు టౌన్ హాల్ సాక్షీభూతంగా నిలిచింది. 1905 జులై 17న అప్పటి జిల్లా కలెక్టర్ బ్రాడి ఈ టౌన్ హాలును ప్రారంభించారు. మహాత్మాగాంధీ, పండిట్ జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్



బాపట్లలోని చారిత్రక టౌన్‌హాల్

బాబు రాజేంద్ర ప్రసాద్ వంటి ఎందరో జాతీయ నాయకులు ఈ టౌన్ హాల్‌ను సందర్శించి పలు సందర్భాల్లో ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. 1913 మేలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభలకు ఈ టౌన్ హాలు ఎందరో ఉద్దండులైన మహామహులకు ఆతథ్యమిచ్చింది. ఇంగ్లాండులో పట్టాభిషిక్తుడు అవుతున్న భారత చక్రవర్తి ఎడ్వర్డ్ గౌరవార్థం ఎడ్వర్డ్ పట్టాభిషేక స్మారక టౌన్ హాల్‌గా దీనికి నామకరణం చేశారు. ఆయన పట్టాభిషేకం రోజునే ఈ టౌన్ హాల్ నిర్మాణం జరిగింది. 1908లో బాపట్లకు వచ్చిన జిల్లా మున్సిఫ్ మెజిస్ట్రేట్ న్యాపతి సుబ్బారావు పంతులు చొరవతో టౌన్ హాల్లో టెన్నిస్ కోర్టు ప్రారంభమైంది. నిత్యం సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాలతో టౌన్ హాల్ ఒక ప్రధాన కేంద్రంగా ఉండేది. ఈ టౌన్ హాల్‌లో ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయిబాబు పర్యవేక్షణలో న్యూస్ పేపర్ క్లబ్ నిరంతరం పాఠకులకు అందుబాటులో ఉండటం విశేషం.

మహానాడును విజయవంతం చేయండి: గొట్టిపాటి

ప్రజాశక్తి-అద్దంకి



ఈ నెల 27,28 తేదీల్లో రాజ మహేంద్రవరం, వేమగిరిలో జరిగే మహా నాడు వేడుకల్లో అద్దంకి నియోజక వర్గంలోని తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ అనుబంధ విభాగాల నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. మహానాడు అంటే తెలుగువారందరికీ పండగని, ఈసారి ఎన్టీఆర్ శతజయంతి కారణంగా మరింత ప్రత్యేకం కానుందని అన్నారు. మహానాడు బహిరంగ సభను నాయకులు, కార్యకర్తలు కలిసి విజయవంతం చేయాలని కోరారు. రాజమండ్రికి టీడీపీ శ్రేణులు తరలిరాకుండా అడ్డంకులు సృష్టిస్తున్న సైకో ప్రభుత్వం టీడీపీ మహానాడు విజయవంతం కాకుండా జగన్ ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోంది. రాష్ట్రం నలుమూలల తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలిరాకుండా చేసేందుకు జగన్‌రెడ్డి ప్రభుత్వం కుయుక్తులు మొదలుపెట్టిందని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండ్రోజులపాటు మహానాడు కోసం బస్సులు కావాలని టీడీపీ నాయకులు ఎక్కడికక్కడ స్థానిక ఆర్టీసీ అధికారులకు విజ్ఞప్తి చేస్తే ఇంతవరకు ఒక్క బస్సు కూడా ఇవ్వడానికి అంగీక రించలేదని అంతే కాకుండా రాజమహేంద్ర వరం చుట్టుపక్కల కల్యాణ మండపాలు, హోటళ్లు సైతం టీడీపీకి శ్రేణులకు ఇవ్వొద్దంటూ హెచ్చరికలు జారీ అయ్యాయి. అంటే జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుందని అన్నారు. ప్రైవేటు బస్సులు, కార్లు, ఇతర వాహనాల కోసం ప్రయత్నాలు చేస్తున్నా.. రవాణా శాఖ అధికారుల నుంచి వాహన యజమానులకు పరోక్ష బెదిరింపులకు అధికార పార్టీ నేతలు దిగడం సమంజసం కాదని ఆయన అన్నారు.

వైసిపి వైఫల్యాలే ఎజెండాగా, రాబోయే రోజుల్లో రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా మహానాడు వేదికగా సమరశంఖం పూరించేందుకు పెద్దఎత్తున మద్దతు పలికేందుకు టిడిపి శ్రేణులు, సామాన్య ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే గొట్టిపాటి ఓ ప్రకటనలో తెలిపారు.

బిల్లులు వెంటనే చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి-కర్లపాలెం



కూలీలతో మాట్లాడుతున్న కృష్ణమోహన్

ఉపాధి కూలీలను ఫొటో తీసే విధానాన్ని ఎత్తివేయాలని, అదేవిధంగా పనిచేసిన బిల్లులు వెంటనే వచ్చే విధంగా చూడాలని, ఆధార్ లింక్ కాకపోవటం వలన రద్దయిన జాబ్ కార్డులు పునరుద్ధరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి కృష్ణమోహన్ అన్నారు. గురువారం కర్లపాలెం మండలంలోని యాజలి, బిడారు దెబ్బ, దూండివారిపాలెం గ్రామాల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి కూలీలు పనిచేసే పని ప్రదేశాలకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రెండు పూటలా పని, రెండు ఫొటోలు పేరుతో వ్యవసాయ కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తోందని అన్నారు. కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీకి తక్కువ నిధులు కేటాయించి కూలీల ఉసురు తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎండాకాలంలో 47 డిగ్రీల ఎండలో ఉదయం 10 గంటల దాకా పని చేయాలంటున్నారని, సాయంత్రం 3గంటల నుంచి పని చేయాలంటున్నారని, వడ దెబ్బకు కూలీల ప్రాణాలు పోతుంటే టెంట్లు, మంచినీరు, మెడికల్ కిట్లు లాంటివి ఏవీ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. ఒకే వర్క్ ఐడితో కూలీలందరూ ఒకే చోట పని చేయటం వల్ల పని చేసిన వారికి, చేయని వారికి ఒకే రకంగా డబ్బులు పడుతున్నాయని, ఇది సరయింది కాదని కూలీలు వివరించారు. రెండు పూటలా పని, రెండు ఫొటోల విధానం తీసివేయాలని, 200 రోజుల పని రూ.600 కూలి ఇవ్వాలని, మంచినీరు లేదా మజ్జిగ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సంఘం నిధులు దారి మళ్లింపునకు యత్నం

సహకరిస్తున్న అధికారులు ● అడ్డుకున్న మహిళలు ● వెలుగు కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని మట్టిగుంట జలజీవన్ గ్రామ సమైక్య సంఘంలో ఉన్న రూ.40 లక్షలకు సంబంధించిన నిధులను పక్కదారి పట్టించేందుకు సన్నాహాలు జరగడంతో దాన్ని నిరసిస్తూ అధిక సంఖ్యలో మహిళలు మట్టిగుంట గ్రామం నుంచి ఐదు ట్రాక్టర్లతో తరలివచ్చి మండల కేంద్రమైన నాగులుప్పలపాడు వెలుగు కార్యాలయం వద్ద గురువారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. వివరాల మేరకు గ్రామ సమాఖ్య సంఘానికి సంబంధించి క్లస్టరు సిసి లక్ష్మి కవిత, ఏపిఎం రవికుమార్ ఇరువురు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి గత ఆరు నెలల నుంచి గ్రామంలో డ్వాక్రా గ్రూపు సభ్యుల మధ్య అనైక్యతను సృష్టించి గ్రామ సమాఖ్య సంఘంలో నిల్వ ఉన్న సుమారు రూ.40 లక్షల నిధులను సభ్యుల అనుమతి లేకుండా గ్రామ సమాఖ్య సంఘం కమిటీ సభ్యులను మార్పు చేసి డ్రా చేసేందుకు సన్నాహాలు చేపట్టారు. దీనిని గ్రహించిన గ్రామ సమాఖ్య సంఘం సభ్యులు ఆ విధంగా జరగడానికి వీలులేదంటూ వెలుగు కార్యాలయం వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టారు. సమాధానం చెప్పేవరకు ఇక్కడ నుంచి కదిలేదని భీష్మించుక్కూచున్నారు. ఏపిఎం శెలవుపై వెళ్లడంతో అందుబాటులో లేరు. అందుకు సంబంధించిన సిసి లక్ష్మీకవిత వచ్చి సమాధానం చెప్పాలని పోలీసులు



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

తెలపడంతో ధర్నా చేస్తున్న మహిళల వద్దకు వచ్చిన సిసి పొరపాటు జరిగింది కొత్తగా మారిన కమిటీ సభ్యుల ద్వారా ఏర్పడిన కొత్తగా ఓపెన్ చేసిన ఎకౌంట్ల ద్వారా లావాదేవీలు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చి బ్యాంకు అధికారులకు లావాదేవీలు జరపకుండా వినతిపత్రం లిఖితపూర్వకంగా అందచేశారు. తదుపరి వచ్చే నెలలో గ్రామ సమాఖ్య సంఘం సభ్యులతో జూన్ నెలలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించి అదేరోజు నూతన కమిటీ ఎన్నుకొని ఆ తరువాతనే లావాదేవీలు జరిపేవిధంగా నిర్ణయించారు. అప్పటి వరకు ఆ నిధులకు ఎటువంటి ఇబ్బంది లేదని హామీ ఇవ్వడంతో మహిళలు ధర్నా విరమించారు.

అందరూ ఐక్యంగా ఉండాలి

ఐద్వా జిల్లా కార్యదర్శి రమాదేవి

ధర్నా చేస్తున్న మహిళల వద్దకు వచ్చిన ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి మాట్లాడుతూ సమస్యలను అందరూ ఐక్యంగా ఉండి పోరాడి పరిష్కరించుకోవాలని అన్నారు. గ్రామ సమాఖ్య సంఘం సభ్యులకు తెలియకుండా అధికారులు తన ఇష్టానుసారంగా సభ్యులను మార్చి సమాఖ్య సంఘంలో నిల్వఉన్న నిధులను పక్కదారి పట్టించేందుకు పూనుకోవడం సరైన పద్ధతి కాదని విమర్శించారు. ఇప్పటికైనా అటువంటి విధానం మానుకోవాలని, లేనిచో మహిళలను పెద్దఎత్తున సమీకరించి ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మహిళలు చేసే న్యాయమైన పోరాటానికి సిపిఎం, తెలుగు దేశం పార్టీ నాయకులు పాల్గొని తమ మద్దతు తెలియజేశారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో ఇక్కట్లు

- ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
- పట్టించుకోని అధికారులు
- చిరువ్యాపారులకు తప్పని తిప్పలు





ప్రజాశక్తి-యర్రగొండపాలెం

భానుడి ప్రభావం, ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారు. అప్రకటిత విద్యుత్ కోతలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. విద్యుత్ కోతలతో కరెంటు ఎప్పుడు ఉంటుందో, పోతుందో తెలియని దుస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

యర్రగొండపాలెం పట్టణంలో..

యర్రగొండపాలెంలో సగం మంది విద్యుత్ వినియోగదారులు నిత్యం లోకల్ కరెంటు కోతలను ఎదుర్కోవాల్సి వస్తోంది. స్థానికంగా తలెత్తే సమస్యలతో తరచూ కరెంటు కోతలు తప్పడం లేదు. రెండేళ్ల క్రితం యర్రగొండపాలెం పట్టణాన్ని రెండుగా విభజించి యర్రగొండపాలెం, మిల్లంపల్లి ఎస్ఎస్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తున్నారు. మిల్లంపల్లి ఎస్ఎస్ పరిధిలోని పట్టణ వాసులకు నిత్యం కరెంటు సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ ఎస్ఎస్‌కు పుల్లలచెరువు మండలానికి వెళ్లే 33 కెవి లైన్ నుంచి కనెక్షన్ ఇచ్చారు. ఇదే లైన్ నుంచి 7 ఎస్ఎస్‌లకు విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ ఏడు ఎస్ఎస్ పరిధిలో ఎక్కడ ఏ సమస్య వచ్చినా లైన్ ట్రిప్ అయ్యినా పట్టణానికి సరఫరా నిలిచిపోతోంది. యర్రగొండపాలెం ఎస్ఎస్ పరిధిలోని వినియోగదారులకు నిరాటంకంగా సరఫరా అవుతుండగా మిల్లంపల్లి పరిధి వినియోగదారులు వేసవిలో తీవ్ర ఉక్క పోతలు అనుభవిస్తున్నారు. యర్రగొండపాలెం పట్టణాన్ని రెండుగా చేసి సరఫరా చేస్తున్న విద్యుత్ అధికారులు ఏదైనా సమస్య ఎదురైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దష్టి పెట్ట లేదు. కోతల ప్రభావంతో బ్రహ్మంగారి ఆర్చి వీధి, ఎస్‌బిఐ బజార్, ఆసిఫ్ నగర్, అంబేద్కర్ నగర్, చైతన్య నగర్, ఎస్‌టికాలనీ, గాయత్రీ నగర్ ప్రాంతాల్లోని ప్రజలు ఉక్కపోతకు గురువుతున్నారు.

వేళాపాళా లేని విద్యుత్ కోతలు

మండుతున్న ఎండలకు తోడు అప్రకటిత కరెంట్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో కరెంట్ ఎప్పుడు తీస్తారో, ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. తెల్లవారు జామున 4 గంటలు నుంచి 7 గంటలు వరకు మధ్యాహ్నం 3 గంటలు నుంచి 6 గంటలు వరకు రాత్రి, పగలు తేడా లేకుండా దాదాపు 3 గంటలు కోతలు విధిస్తున్నారు. దీంతో తాగు నీటి సరఫరా, విద్యుత్‌తో నడిచే పరిశ్రమలు స్వయం ఉపాధి యూనిట్లు దెబ్బతింటున్నాయి. చిరు వ్యాపారులకు ఇబ్బందిగా మారాయి.

రాత్రిపూట నిద్రపోతే ఒట్టు..

రాత్రి పూట కరెంటు కోతలు విధిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో కంప్యూటర్లు పనిచేయడం లేదు. విద్యుత్ కోతల పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా కోతలు విధిస్తుండడంతో నిద్రలేని పరిస్థితి ఏర్పడింది. వేసవి నేపథ్యంలో విద్యుత్ వినియోగం పెరగడంతో లోవోల్టేజీ సమస్య ఎక్కువైంది. దీంతో మోటార్లు కాలిపోతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయి

కేశనపల్లి సుబ్బమ్మ



విద్యుత్ ఛార్జీలు పెరిగిపోయాయి. బిల్లులు అధికంగా వస్తున్నాయి. విద్యుత్ కోతలు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. వద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. నాలుగు రోజులుగా సరఫరా నిలిపివేస్తున్నారు.

ఎప్పుడు తీస్తున్నారో తెలియడం లేదు

కైపు బ్రహ్మారెడ్డి, మురారిపల్లి



రాత్రిళ్లు ఇష్టం వచ్చినట్లు కరెంటు తీసేస్తున్నాడు. బధ వారం సాయంత్రం నాలుగు గంటలకు తీసి రాత్రి 10 గంటలకు ఇచ్చారు. యర్రగొండ పాలెంలో మరింత ఘోరంగా ఉంది. నాలుగు గంటలకు కరెంటు తీశారు. తొమ్మిది గంటలకు ఇచ్చారు. ఇలా ఎప్పుడు ఇస్తారో తెలియదు. ఇలా కోతల వల్ల ఇబ్బందులు పడుతున్నాం.

వారం రోజుల్లో పనులు పూర్తి

తలపాటి అల్లూరయ్య, విద్యుత్ ఎఇ, యర్రగొండపాలెం



యర్రగొండపాలెం పట్టణంలో ఇప్పుడున్న రెండు లైన్లకు తోడు మరో 11 కెవి లైన్ ఏర్పాటు చేసి మూడు భాగాలుగా చేయనున్నాం. ఈ పనులు చేసేందుకు అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంది. వారం రోజుల్లో పనులు పూర్తిచేసి విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

గాలి వాన బీభత్సం

- కూలిన చెట్లు
- నేలకొరిగిన స్తంభాలు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. సంత మాగులూరు, పుట్టావారిపాలెం గ్రామాల మధ్య, గుంటూరు, కర్నూలు రహదారిపై భారీ చెట్లు కూలిపోయాయి. ట్రాపిక్‌కు అంతరాయం కలిగింది. ట్రాఫిక్ నిలిచిపోవడంతో ప్రయాణికులు ఆందోళనకు గురయ్యారు. చెట్లు విరిగి పడటంతో విద్యుత్ తీగలు తెగిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కొన్ని గ్రామాల్లో రేకుల ఇళ్ల పైకప్పు లేచిపోయాయి. ఈదురు గాలులు, భారీ వర్షానికి గుంటూరు–కర్నూలు రహదారిపై చెట్లు కూలిపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. తహశీల్దారు అశోకవర్ధన్, ఎస్ఐ శివకుమార్ రంగంలో దిగి జెసిబితో రోడ్డుపై పడిపోయిన చెట్లను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. **కొనకనమిట్ల :** కొనకనమిట్లలో ఈదురుగాలులు, వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. స్థానిక ఎస్‌సి కాలనీలోని చెట్లు నేలకొరిగాయి. నాగరాజుకుంట, ఎదురాళ్ళపాడు, కొత్తపల్లి, సిద్ధవరం, కాట్రగుంట గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది. **భట్టిప్రోలు :** పలు గ్రామాల్లో ఈదురు గాలులు కూడిన వర్షం పడింది. పలు చోటు చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరాకు



కారుమంచి వద్ద కొట్టుకు పోయిన చప్టా

అంతరాయం కలిగింది. పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది. **చీరాల :** మండల పరిధిలోని ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో దేవాంగపురి వద్ద విద్యుత్ స్తంభం నేలకొరిగింది. పలుచోట్ల రోడ్లపై తాటిచెట్లు విరిగి పడిపోయాయి. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.. ఈదురు గాలులకు రహదారులపై పడిన చెట్లు, విద్యుత్ స్తంభాలు ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి అధికారులతో పరిశీలించారు. **చీమకుర్తి :** ఈదురు గాలులకు జివిఎల్ పురం, రామచంద్రాపురం మధ్యలో విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలు ప్రాంతాలలో చెట్లు విరిగిపడ్డాయి. **వేటపాలెం :** వేటపాలెం మండలం అక్కాయపాలెం పంచాయతీ పరిధిలోని మోహన్‌రావుకాలనీ, లక్ష్మీపురం, పుల్లరిపాలెం పంచాయతీ రామచంద్రాపురం గ్రామాల్లో ఈదురు గాలులు వీశాయి. దీంతో ఏడు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి.



సంతమాగులూరులో నిలిచిన ట్రాఫిక్

టంగుటూరు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో వర్షం పడింది. గురువారం సాయంత్రం 5 గంటల సమయంలో టంగుటూరు, మండలంలోని పలు గ్రామాలలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. కారుమంచి గ్రామానికి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కారుమంచి గ్రామానికి వెళ్లే రహదారిలో మల్లవరప్పాడు గ్రామం వద్ద తూముల నిర్మాణం జరుగుతోంది. వర్షానికి తూములు కొట్టుకు పోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. సమాచారం అందుకున్న టంగుటూరు ఎంపిపి పటాపంజుల కోటేశ్వరమ్మ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని తూములను సరిచేసి రోడ్డుపైన కంకర తోలి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. వెంటనే స్పందించి తూములను సరిచేయించి రాకపోకలు పునర్ధురించేందుకు కృషి చేసిన ఎంపిపి కోటేశ్వరమ్మకు సమీప గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



లలితకు పుష్పగుచ్ఛమిస్తున్న కెవిఆర్

'కెవిఆర్' అకాడమీకి రాష్ట్ర స్థాయి ర్యాంకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

తెలంగాణా ఎంసెట్‌లో కెవిఆర్ స్టార్ లైట్ నీట్ అకాడమీ విద్యార్థులు సత్తా చాటారు. పివి.లలిత 761 స్టేట్ ర్యాంకుతో అత్యుత్తమ స్థాయిలో నిలిచింది. వి.బాబు శ్రీమాన్ 824 ర్యాంకు, పి.భవ్య 1,847 ర్యాంక్, లిఖిత 3881 ర్యాంక్, హర్షవర్ధన్ సాయి 5,356 ర్యాంక్, టి.దుర్గా వినూత్న 6, 015 ర్యాంక్ సాధించారు. ఉత్తమ ర్యాంకులను సాధించిన విద్యార్థులకు గురువారం అభినందన సభ నిర్వహించారు. సభలో కెవిఆర్ స్టార్ లైట్ నీట్ అకాడమీ అధినేత సీనియర్ ఫిజిక్స్ లెక్చరర్ కెవిఆర్ మాట్లాడుతూ టిఎస్ ఎంసెట్ లో తమ అకాడమీ కి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్తుత్తమ ర్యాంకులు సాధించటం ఆనందంగా ఉందన్నారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు,అదుకు సహకరించిన అధ్యాపకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న నల్లూరి వెంకటేశ్వర్లు

జెఇఇ, టిఎస్ ఎంసెట్‌లో 'శ్రీప్రతిభ'కు ఉత్తమ ర్యాంకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జెఇఇ మెయిన్స్, తెలంగాణా ఎంసెట్ ఫలితాలలో శ్రీ. ప్రతిభ విద్యాసంస్థల విద్యార్థులు సంచలన విజయాలు సాధించారు. దొరసాల విష్ణువర్ధన్ రెడ్డి మెడికల్ విభాగంలో 3,833 వ ర్యాంకు సాధించింది. ఇంజినీరింగ్ విభాగంలో వెన్నా జ్యోతి 3,954 వ ర్యాంకు, పిచ్చపాటి తేజస్విని 4,640, గుజ్జుల అంకి రెడ్డి 5,063 , నూర్‌బాషా షేక్ అబ్దుల్ 5,138 , వడ్లమూడి గౌతమి 7,107 ర్యాంక్, దొడ్డక విష్ణు తేజ 7,183 ర్యాంక్, భోగది శ్యామ్ ప్రసాద్ 7,675, బొప్పరాజు నిశ్చల్ 8,598, కిలారి సుస్మిత్ చౌదరి 9,065, పోట్ల రవళి 9,494, గంగిరెడ్డి నరేంద్ర రెడ్డి 9,935 ర్యాంక్ సాధించారు. జెఇఇ మెయిన్స్ బి.ఆర్క్, బి.ప్లాన్ విభాగంలో జాతీయ స్థాయిలో 82, 140, 142, 160,169, 197, 210, 222, 281, 341, 456, 477, 725, 743, 780, 879, 959 ర్యాంకులు సాధించారు. ఉత్తమ ర్యాంలకు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు, సహకరించిన అధ్యాపకులను శ్రీప్రతిభ విద్యాసంస్థల చైర్మన్ నల్లూరి వెంకటేశ్వర్లు, వైస్ ఛైర్మన్ నల్లూరి సీతారామాంజనేయులు, సిఇఒ జయప్రకాష్ నారాయణ్ అభినందించారు.

కాంట్రాక్టర్ నరసింహారెడ్డి మృతి

పొదిలి : మండలంలోని బుచ్చనపాలెం గ్రామానికి చెందిన సీనియర్ కాంట్రాక్టర్ పల్లెర్ల నరసింహారెడ్డి (92) అనారోగ్యం, వయోభారంతో గురువారం మృతి చెందాడు. సీనియర్ కాంట్రాక్టర్‌గా మంచి గుర్తింపు పొందిన నర్సింహారెడ్డి మరణ వార్త తెలిసిన పట్టణం లోని పలువురు ప్రముఖులు నాయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. సాయంత్రం సమయంలో నరసింహారెడ్డికి అంత్యక్రియలు నిర్వహించారు.

నీటి కోసం పొలం బాట

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బిందెడు నీటి కోసం ప్రజలు పొలం బాటపట్టారు. ఈ ఘటన యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలోని పుల్లలచెరువు మండలం రంగన్నపాలెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. గ్రామంలోని డీప్‌బోర్లన్ని ఒట్టిపోయాయి. చేతి పంపులు పనికి రాకుండా పోయాయి. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి మంచినీటి పథకాలను ఏర్పాటు చేసినా వాటి ద్వారా చుక్కనీరు రావడం లేదు. ముటుకుల మంచినీటి పథకం ద్వారా రంగన్నపాలెం గ్రామానికి సాగర్ జలాలు అందిస్తామన్న పాలకుల మాట నీటి మూటగా మారింది. మంచినీటి పథకాల మరమ్మతుల పేరుతో మాత్రం కాంట్రాక్టర్లు ఏటా రూ. కోట్లు దండుకుంటున్నారు. ఇంత


పొలంలో నీరు పట్టుకుంటున్న దృశ్యం

జరుగుతున్నా అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో గత్యంతరం లేక రంగన్నపాలెం ప్రజలు సైకిళ్లపై బిందెలు పెట్టుకొని బిందెడు నీటి కోసం పొలం బాట పడుతున్నారు. పొలాల్లో అరకొరగా వస్తున్న నీటిని డ్రిప్ పైపుల సహాయంతో పట్టుకొని ఇళ్లకు తెచ్చుకుంటున్నారు. పశు పోషకుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. పశువులను పోషించుకోలేక, వచ్చిన ధరకు తెగ నమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వాలంటీర్ల పాత్ర కీలకమని జడ్‌పిటిసి అక్కిదాసరి ఏడుకొండలు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో గరిమెనపెంట, గొట్లగట్టు, గార్లదిన్నె గ్రామాల్లోని వాలంటీర్లను గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ రావూరి జనార్ధన్ మాట్లాడుతూ సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం వాలంటీర్లకు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు దొంతిరెడ్డి జయమ్మ, వెంకటరెడ్డి, ఓబులరెడ్డి, మండల పరిషత్ కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నీటివనరుల లభ్యత పరిశీలన

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండల పరిధిలోని బోడిరెడ్డిపల్లి గ్రామంలో ఎఫర్ట్ ఇడి జెవి. మోహన్‌రావు, రిలయన్స్ పౌండేషన్ ప్రకాశం జిల్లా డిపిఎం బాబూరావు, విఎఎ వస్త్రంనాయక్ గ్రామంలోని చెరవులు, ట్యాంకులు, నీటి లభ్యతపై విలేజ్ మ్యాపింగ్ చేశారు. గ్రామంలో తిగిరి ప్రజలతో మాట్లాడారు. చెరువు అభివృద్ధి గురించి ప్రజలతో చర్చించారు. విలేజ్ మ్యాపింగ్ చేసి గ్రామంలోని నీటి వనరులను గుర్తించి అంచనా నిర్వాహణ, ప్రణాళికను రూపొందించారు. ఈ కార్యక్రమంలో పెద్దారవీడు ఇడబ్ల్యుకె శివ, జిగీషా, సునీల్, జగన్ పాల్గొన్నారు.

26న రిలే నిరాహార దీక్ష

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 26న ఉదయం 10 గంటలకు ఉద్యోగుల హక్కుల సాధనకై రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నట్లు ఎపిజిఇఎ తాలూకా అధ్యక్షుడు షేక్ జానీబాషా గురువారం తెలిపారు. ఈ రిలే దీక్షల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిరణ్ కుమార్‌రెడ్డి, వర కుమార్ పాల్గొంటారని తెలిపారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొని దీక్షను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కట్టావారిపాలెంలో అన్నదానం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పంచాయతీ పరిధిలోని కట్టావారిపాలెంలో పోలేరమ్మ తల్లి 10వ వార్షికోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక స్వామి, నాంచారమ్మ, దేవత సమేత అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. హాజరయ్యారు.


ప్రిన్సిపల్ సెక్రెటరీకి వినతి పత్రం అందజేస్తున్న ఆరోగ్య మిత్రలు

ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఎపి ఐఐసి భవనంలో వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎంటి.కృష్ణబాబును గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆరోగ్య మిత్రుల సమస్యలు పరిష్కరించాలన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. స్పందించిన వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణబాబు మాట్లాడుతూ ఆరోగ్య మిత్రుల సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం చేసే విధంగా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి,ఎస్‌టి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, ప్రధాన కార్యదర్శి దర్శనం రాంబాబు, కార్యదర్శి జెడ్డా కిరణ్ కుమార్, రాష్ట్ర నాయకురాలు బంగారు శ్రీ, రాష్ట్ర నాయకులు గోవిందు, రామ్మోహన్ రావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి తెలిపారు. మున్సిపల్ పరిధిలోని మూడవ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో ద్వారా ప్రజల సమస్యలు తెలుసుకొని కొన్ని సమస్యలను పరిష్కరించినట్లు తెలిపారు. అర్హత ఉండీ సంక్షేమ పథకం అందని వారుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

చిర్లంచెర్ల బాలమురళీ కృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, చాతరాజుపల్లి అంజమ్మ శ్రీనివాస్, వార్డు కౌన్సిలర్ అంబడిపూడి బాలచెన్నమ్మ, మున్సిపల్ అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించాలి : ఎంపిపి

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలాభివృద్ధికి అధికారులందరూ సహకరించాలని ఎంపిపి అత్యాల జఘన్య కోరారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి అత్యాల జఘన్య అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ డివి.రమణారెడ్డి, మురుగుమ్మి ఎంపిటిసి చెరుకూరి సతీష్, ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ కె.రాజ్యలక్ష్మీ, పశువైద్యుడు డాక్టర్ పోలయ్య, ఫారెస్టు, ఐసిడిఎస్, ట్రాన్స్‌కో, వివిధ శాఖల అధికారులు


మాట్లాడుతున్న ఎంపిపి

తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కల్పించాలి : జడ్జి

ప్రజాశక్తి-దర్శి

బాలలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సీనియర్ సివిల్ జడ్జి జిఎల్‌వి.ప్రసాద్ తెలిపారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో అంతర్జాతీయ తప్పిపోయిన బాలల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జడ్జి ప్రసాద్ మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులకు చట్టాలు, విధులు, బాధ్యతలు, హక్కుల పై అవగాహన కల్పించాలన్నారు. పిల్లలలో మానసికంగా చైతన్యవంతులను చేస్తే వారికి ఎలాంటి సమస్యలు రావన్నారు. ఈ కార్యక్రమంలో డిటీ రవిశంకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. కోటిరెడ్డి, న్యాయవాదులు చెన్నకేశవులు, సురేష్, మనోరమ్మ పాల్గొన్నారు. **కనిగిరి :** తప్పిపోయిన పిల్లల దినోత్సవాన్ని పురస్కరించుకొని మున్సిపాలిటీ పరిధిలోని కాశిరెడ్డి కాలనీలో గుడ్‌హెల్ప్ స్వచ్ఛంద సంస్థ మరియు మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సును


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రసాద్

నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పిల్లల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. పిల్లలు తప్పిపోకుండా, అపహరణకు గురికాకుండా జాగ్రత్తలు పాటించేలా అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుడ్‌హెల్ఫ్ డైరక్టర్ రమేష్‌బాబు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

పేర్లు నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి-టంగుటూరు

ఈ నెల 27, 28 తేదీల్లో టంగుటూరులో నిర్వహించనున్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వాలీబాల్ ఓపెన్ టోర్నమెంట్ పోటీలకు క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆర్గనైజింగ్ కమిటీ ఫిజికల్ డైరెక్టర్ తుల్లిబిల్లి అశోక్ బాబు తెలిపారు. ప్రకాశం, గుంటూరు, నెల్లూరు జిల్లాల పరిధిలోని క్రీడాకారులు వాలీబాల్ పోటీలు టంగుటూరు పురం సెంటర్ లోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పోటీలకు హాజరైన క్రీడాకారులకు భోజనం, వసతి కల్పించనున్నట్లు తెలిపారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.15వేలు, ద్వితీయ బహుమతిగా రూ,10వేలు, తతీయ బహుమతి రూ.7వేలు, నాలుగవ బహుమతి క్రింద రూ.5వేల నగదు బుహతుతి అందజేయనున్నట్లు తెలిపారు.

దరఖాస్తులకు ఆహ్వానం

ప్రజాశక్తి-దర్శి

స్థానిక ఆదర్శ మోడల్ పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో జూనియర్ ఇంటర్ ప్రవేశానికి వచ్చేనెల 7లోఉ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ హసీనా భాను ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒసి, బిసి, ఇడబ్ల్యుఎస్ విద్యార్థులు రూ. 200, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ. 150 ఫీజు చెల్లించాలన్నారు.

నారాయణస్కూల్‌లో తనిఖీ

ప్రజాశక్తి-కనిగిరి

ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలపై చర్యలు తీకుంటున్నామని డిప్యూటీ డిఇఒ చంద్రమౌళేశ్వర్ తెలిపారు. కనిగిరి పట్టణంలోని నారాయణ స్కూల్‌ను గురువారం తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని కారణంగా నారాయణ స్కూల్‌ను తనిఖీ చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆర్‌జేడీ ఇచ్చిన ఆదేశాల మేరకు డిప్యూటీ డిఇఒ పాఠశాలో తనిఖీ చేశారు. అనుమతులు లేకపోవడాన్ని గుర్తించి పాఠశాలకు తాళం వేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

మహిళలకు రక్తదానం

ప్రజాశక్తి-చీమకుర్తి

భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నలుగురు మహిళలకు రక్తదానం చేశారు. స్థానిక జవహర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రమణారెడ్డి వారిపాలెంకు చెందిన అంజమ్మ, చీమకుర్తికి చెందిన సుశీల, కొనకనమిట్లకు చెందిన చిట్టి, గంగవరానికి చెందిన పి. సుశీలకు గురువారం రక్తదానం చేశారు. ఎలీషా,శిద్ధు,అమీర్,శ్రీనాథ్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్‌ను జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.జవహర్ అభినందించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి జి. దేవరాజు మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తం కోసం సంప్రదిస్తే భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ స్పందించి రక్తం దానం చేయండంఅభినందనీయమని తెలిపారు. భవిష్యత్‌లోనూ కార్యక్రమాలు కొనసాగించాలనారు.

పిఏసిఏస్ గోడౌన్ తొలగింపు

శిథిలావస్థకు చేరడమే కారణం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండల కేంద్రం భట్టిప్రోలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి చెందిన అద్దేపల్లిలోని గోడౌన్ శిథిలావస్థకు చేరటంతో ఎట్టకేలకు తొలగింపునకు శ్రీకారం చుట్టారు. గత 60 ఏళ్ల క్రితం నిర్మించిన అద్దేపల్లి మొగల్ స్ట్రీట్‌లోని ఈ గోడౌన్ 30 ఏళ్లుగా దెబ్బతిని నిరుపయోగం అయ్యింది. ఈ గోడౌన్ శిథిలమై పాములు చేరి గృహాలలోకి వస్తున్నాయని, గతంలో చుట్టుపక్కల వారు అధికారులకు విన్నవించినా పట్టించుకున్న నాథుడే లేడని అప్పట్లో ప్రజలు ఆరోపించారు. కాగా ఎట్టకేలకు ఈ గోడౌన్‌ను తొలగించి నూతన గోడౌన్ నిర్మాణం చేపట్టాలని సొసైటీ పాలకవర్గం భావించినట్లు కనిపిస్తోంది. సుమారు 6 సెంట్ల స్థలంలో ఉన్న ఈ గోడౌన్ స్థానంలో మరో గోడౌన్ నిర్మిస్తే పిఏసిఎస్ సమస్య తీరుతుంది. ఇప్పటికే సూరేపల్లి సొసైటీకి దాతలు ఇచ్చిన స్థలంలో అవసరమైన గోడౌన్ నిర్మించి వినియోగించుకుంటుండగా భట్టిప్రోలు సొసైటీకి మాత్రం ఎలాంటి గోడౌన్ సౌకర్యం లేక అవసరమైనప్పుడు పక్కనే ఉన్న మార్కెట్ యార్డ్ గోడౌన్‌లు వినియోగించుకోవాలిసి వస్తుంది. ఇలాంటి పరిస్థితిలో అద్దేపల్లిలో ఉన్న సొంత గోడౌన్ స్థానంలో మరో నూతన గోడౌన్ నిర్మిస్తే పిఏసిఎస్‌కు గోడౌన్ సమస్య తీరినట్లవుతుంది.



అద్దేపల్లిలో శిథిలావస్థకు చేరిన పిఏసిఎస్ గోడౌన్

వైసిపి నాయకుల కనుసన్నల్లో గోడౌన్ తొలగింపు

వ్యవసాయ పరపతి సంఘానికి సంబంధించి అద్దేపల్లి గోడౌన్ తొలగింపు పనులు స్థానిక అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో జరగటం విశేషం. శిథిలావస్థకు చేరిన ఈ గోడౌన్‌ను తొలగిస్తున్న అంశం సొసైటీ పాలకవర్గానికి తెలిసినట్లు కూడా లేదు. గోడౌన్ తొలగింపునకు ముందుగా సొసైటీలో తీర్మానం చేసి జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఉన్నతాధికారులుకు అనుమతి కోసం నివేదించాలి. తదనంతరం తొలగింపునకు ఎంత ఖర్చు అవుతుంది అనేది అంచనా రూపొందించి తగిన నిధులు కేటాయించి శిథిలావస్థలో ఉన్న గోడౌన్‌ను తొలగించాలి. కానీ ప్రస్తుతం జరుగుతున్న తొలగింపు పనులకు ఎలాంటి అంచనాలు, అనుమతులు లేకుండానే పనులు జరగటం, అది కూడా సొసైటీకి సంబంధించిన సిబ్బంది, పాలకవర్గం లేకుండా అధికార పార్టీ నాయకులు దగ్గరుండి పనులు జరిపించటం పలు అనుమానాలకు తావిస్తోంది. 60 ఏళ్ల క్రితం దిక్కుమొక్కు లేకుండా ఖాళీగా ఉన్న ఈ స్థలంలో ఆనాటి పాలకులు రైతుల అవసరాల రీత్యా గోడౌన్ నిర్మించారు. అప్పటి నుంచి ఈ స్థలం సొసైటీ ఆధీనంలో ఉండిపోయింది. ప్రస్తుతం తొలగిస్తున్న గోడౌన్ స్థలంలో మరో గోడౌన్ నిర్మాణం చేపట్టటంలో జాప్యం జరిగితే ఈ స్థలం కబ్జాదారుల చేతిలో బలయ్యే ప్రమాదం ఉందని, అలాంటి స్థితికి రాకముందు సొసైటీ పాలకవర్గం, సంబంధిత అధికారులు చొరవ చూపి స్థలాన్ని పరిరక్షించాలని రైతులు కోరుతున్నారు. ఈ విషయంపై సొసైటీ సిఇఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ సొసైటీకి గోడౌన్ అవసరత ఉన్నందున తొలగిస్తున్న గోడౌన్ స్థానంలో నూతన గోడౌన్ నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.



శిథిలావస్థకు చేరిన గోడౌన్‌ను తొలగిస్తున్న ప్రొక్లైన్

యద్దనపూడి దళితులకు రక్షణ కల్పించాలి

జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేసిన మంద కృష్ణ మాదిగ

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల జిల్లా యద్దనపూడిలో దళితులపై దాడులు జరుగుతున్న నేపథ్యంలో వారికి రక్షణ కల్పించేందుకు ప్రత్యేక పోలీసు బలగాలను కేటాయించాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను కోరారు. మంగళవారం యద్దనపూడి దళిత బాధిత కుటుంబాలతో కలసి అమరావతి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో బాపట్ల ఎస్పీకి యద్దనపూడి దళితుల సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా కృష్ణ మాదిగ మాట్లాడుతూ యద్దనపూడి గ్రామంలో దళిత వాడకు చెందిన మున్నంగి వీరయ్య.. అగ్రవర్ణ కులానికి చెందిన జి సాంబయ్య మధ్య ప్రభుత్వ రేషన్ పంపిణీ అంశంపై జరిగిన వివాదం దాడులు, ప్రతిదాడులకు దారితీసింది. దాడి ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. న్యాయ విచారణ చేసి దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని కృష్ణ మాదిగ డిమాండ్ చేశారు. రాజకీయ పార్టీలు దళితులపక్షాన అండగా లేకుండా అగ్రకులాల వారికే మద్దతు పలుకడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. దాడి చేసినవారు ఎంతటివారైనా చట్టపరంగా శిక్షిస్తామని ఎస్పీ తెలిపినట్లు కృష్ణ మాదిగ తెలిపారు. భవిష్యత్తులో యద్దనపూడి దళితులపై ఎలాంటి దాడులు జరగకుండా గ్రామంలో పోలీస్ పికెటింగ్ పెంచుతామని ఎస్పీ హామీ ఇచ్చారని తెలిపారు. వినతిపత్రం ఎస్పీకి అందజేసిన వారిలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజుమాదిగ, ఎంఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి భిక్షాలు మాదిగ, బాపట్ల జిల్లా ఎంఎస్‌పి కన్వీనర్ బుడంగుంట్ల లక్ష్మీ నరసయ్య మాదిగ, గుంటూరు జిల్లా కన్వీనరు కూచిపూడి సత్యం మాదిగ, గుంటూరు జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ వేమూరి సుధీర్ మాదిగ, దళిత బాధిత కుటుంబాల సభ్యులు ఉన్నారు.



బాపట్ల జిల్లా ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న కృష్ణ మాదిగ



చెక్కును అందజేస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

ప్రజాశక్తి-రేపల్లె

రేపల్లె మండలం సోడాయపాలెం గ్రామానికి చెందిన మండే రత్నబాబు అనే వ్యక్తి సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో వారికి చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ రూ.3.50 లక్షల చెక్కు మంజూరు కావడంతో వారి కుటుంబ సభ్యులకు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు మాట్లాడుతూ మాట్లాడుతూ మంజూరయిన సీఎం రిలీఫ్ ఫండ్‌ను లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. పేద ప్రజలు ఆరోగ్యంగా ఉండటమే సీఎం జగన్ ధ్యేయమన్నారు. నిరుపేదలకు ఆర్థిక భారం కాకుండా వైద్యానికి అయ్యే ఖర్చులను సీఎం జగన్ అందిస్తున్నారన్నారు. మంజూరుకు కృషి చేసిన రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావుకి కృతజ్ఞతలు తెలిపారు. చెక్కులు తీసుకున్న లబ్ధిదారుడు మోపిదేవి వెంకటరమణారావుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం

ప్రజాశక్తి-బాపట్ల

విద్యలో ఉన్నత ప్రమాణాలతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ స్ఫూర్తితో మరింత ప్రోత్సహిస్తామని బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ బాధ్యులు వేగేశన నరేంద్రవర్మ అన్నారు. గురువారం ఎన్టీఆర్ శతజయంతిని పురస్కరించుకుని బాపట్ల మండలం అప్పికట్ల శంకర్ కళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విద్యార్థులకు ప్రతిభ పురస్కారాల ప్రదాన కార్యక్రమానికి నరేంద్రవర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి గ్రామానికి చెందిన ఆచంట సునీత అధ్యక్షత వహించారు. నరేంద్రవర్మ మాట్లాడుతూ ఎన్టీఆర్ విశ్వవిద్యాలయాన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరారు. తెలుగుదేశం పార్టీకి పురిటిగడ్డ అయిన అప్పికట్ల గ్రామం అంటే ఎన్టీఆర్ ఎనలేని అభిమానమన్నారు. ఈ గ్రామం ప్రజా చైతన్యానికి మారుపేరని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నరేంద్రవర్మ నగదు పురస్కారాలు అందజేశారు. జూనియర్ ఇంటర్‌లో రాష్ట్రంలో మొదటి ర్యాంకు సాధించిన గండూరి భవ్య, నాలుగో ర్యాంకు సాధించిన నామినేని బ్రాహ్మణి, ఆ చంటి రిషిత, రొంపిచర్ల జీవనజ్యోతి, కె శ్రీదేవి, మర్రి జాహ్నవితో పాటు పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన కోటి మేఘన, గుమ్మడి ఐశ్వర్యలను నరేంద్రవర్మ సన్మానించారు. తొలుత అప్పికట్లలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో తాత జయప్రకాష్ నారాయణ, సలగల రాజశేఖర్ బాబు, మానం విజేత, జిట్టా ప్రమీలారాణి, ఆకురాజు రాజేశ్వరి, ముక్కామల శివ, ఇనగంటి గాంధీ, గ్రామ సర్పంచ్ రాజేష్, భర్తీపూడి సర్పంచ్ ఆ చంటి అమరేష్, పట్టాభి రామారావు, ఇనుగంటి శ్రీనివాసరావు, కంతేటి అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వేగేశన నరేంద్రవర్మ



వాలంటీర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

వాలంటీర్లకు పురస్కారాలు

ప్రజాశక్తి-కారంచేడు

బాపట్ల జిల్లా కారంచేడు మండలంలో గురువారం నాడు జరిగిన వాలంటీర్ల పురస్కార కార్యక్రమానికి మొత్తం 182 మంది వాలంటీర్లకు వివిధ రకాల పురస్కారాలు ప్రదానం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, కారంచేడు జడ్పిటిసి యార్లగడ్డ రజిని శ్రీనివాసరావు, ప్రత్యేక అధికారి రామారావు, ఈఓఆర్‌డి ఆర్ రమేష్‌బాబుల చేతుల మీదుగా మండలంలోని ఒకరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవారత్న, మరో 176 మందికి సేవమిత్ర పురస్కారాలు పంపిణీ చేశారు. పారదర్శకంగా పని చేసినందుకు వాలంటీర్లు అందరికీ ఈ పురస్కారాలు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుబ్బారావు మండలంలోని ఎంపీటీసీలు, వివిధ అధికారులు పాల్గొన్నారు.

మహానాడుకు భారీగా తరలిరండి

ప్రజాశక్తి-వేమూరు: ఈనెల 27న టిడిపి రాజమండ్రిలో నిర్వహించనున్న మహానాడుకు పార్టీ శ్రేణులు వేలాదిగా తరలి రావాలని టిడిపి వేమూరు నియోజకవర్గ కమిటీ కోరింది. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ నెల 28వ తేదీన జరిగే బహిరంగ సభకు వేమూరు నియోజకవర్గం నుంచి భారీగా కార్యకర్తలు తరలిరావాలని కోరింది. వేమూరు నియోజకవర్గంలోని గ్రామ, మండల, నియోజకవర్గ, పార్లమెంట్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీలో వివిధ హెూదాలలో ఉన్న నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ కమిటీ ఆ ప్రకటనలో కోరింది.



నూతన వధూవరులతో ఆనందబాబు

మాజీ మంత్రి విస్తృత పర్యటన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

వేమూరు నియోజకవర్గంలో గురువారం మాజీమంత్రి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు, విస్తృతంగా పర్యటించి పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు రాయన ప్రసాదరావు కుమార్తె వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రతో కలసి ఆశీర్వదించారు. చుండూరు మండలం ఏబిఎం పాలెం, కొల్లూరు మండలం కిష్కిందపాలెం, అమృతలూరులో పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆసరా డబ్బు నూరు శాతం జమ

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

వైఎస్ఆర్ ఆసరా మూడో విడత డబ్బులు ఈ నెల 20న 100 శాతం డబ్బులు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయ్యాయని బాపట్ల వైఎస్ఆర్ క్రాంతి పథం ఏపీఎం దగ్గుబాటి సురేష్ విలేకరులకు తెలిపారు. గురువారం బాపట్లలో ఆయన కార్యాలయంలో పథకం వివరాలు తెలిపారు. బాపట్ల మండలంలో 1600 గ్రూపుల ఉన్నాయన్నారు. వీటిలో 16 వేల 91 మంది సభ్యులుగా ఉన్నారు.మూడవ విడుత గా రూ 16 కోట్ల 37 లక్షల నగదు జమ అయింది. మొత్తం మూడు విడతల ద్వారా 49 కోట్ల 10 లక్షల ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు.



ప్రియవర్షిత



వెంకటవంశీ

తెలంగాణ ఎంసెట్‌లో...

'శ్రీసాధన' విద్యార్థుల విజయదుందుభి

మార్కాపురం : తెలంగాణ రాష్ట్ర ఎంసెట్ ఇంజినీరింగ్ ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో మార్కాపురంలోని శ్రీసాధన జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుంధుబి మ్రోగించారు. ప్రియవర్షిత 8,606వ ర్యాంకు సాధించింది. బైపిసి విభాగంలో రాజారపు వెంకటవంశీ 8,995వ ర్యాంకు, జాజి వెంకటసాయి 12,581వ ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ టి.కృష్ణారెడ్డి తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళళాశాల డైరెక్టర్లు రాజగోపాల్‌రెడ్డి, విఆర్‌కె.ప్రసాద్, ఎంవి. కృష్ణారెడ్డి, జిఎల్.రమేష్‌బాబు తదితరులు అభినందించారు.

మున్సిపల్ వర్కర్స్ యూనియన్

జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుబ్బరాయుడు, శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కె.సుబ్బ రాయుడు (మార్కాపురం),కొర్నెపాటి శ్రీనివాసరావు(ఒంగోలు) ఎన్నికయ్యారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం నిర్వహించిన ప్రకాశం జిల్లా పదో మహాసభలో 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. 11 మంది ఆఫీస్ బేరర్స్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ఇట్ట నాగయ్య, పోకల కోటేశ్వరరావు, కె.సామ్రాజ్యం, ఎస్‌కె. ఖాదర్ వలీ, కార్యదర్శులుగా శ్రీరామ శ్రీనివాసరావు, డి.నాగులు, బి.కోటేశ్వరరావు, కోశాధికారిగా పాలేటి ఏడుకొండలు ఎన్నికయ్యారు. 10 మంది సభ్యులుగా మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మహాసభ ముగింపు సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి. రఫీ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముకొని ప్రజలు, ఉద్యోగులకు నష్టం చేస్తున్నారన్నారు. ప్రజలపై అధిక ధరలు మోపుతున్నారన్నారు. విద్యుత్, గ్యాస్ ధరలను పెంచారన్నారు. స్వచ్ఛ భారత్ పేరుతో పట్టణ ప్రజలపై యువజర్ ఛార్జీలు, పన్నులు అధికంగా వసూలు చేస్తున్నారన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు, పరిష్కరించకుండా, హామీలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ప్రచార జాతాలు ఈనెల 31 నుంచి ప్రారంభమవుతున్నాయన్నారు. ఈ ప్రచార జాతాలు మున్సిపల్ ఉద్యోగులు కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్రంలో అన్ని మున్సిపాలిటీలోనూ ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ ఉద్యోగులు, సమస్యలపై కొత్త కమిటీ సమరశీల పోరాటాలు నిర్వహించాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో కోవిడ్ కార్మికులకు గత ఐదు నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా ఒంగోలు నగరపాలక సంస్థ అనేక ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు. మున్సిపల్ అధికారులకు అనేకసార్లు విన్నవించిన పట్టీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, తక్షణమే ఐదు నెలలు వేతన బకాయలు విడుదల చేయాలన్నారు. లేకపోతే మున్సిపల్ కార్మికులందరిని ఐక్యం చేసి పోరాటం చేస్తామన్నారు. ఆప్కాస్‌లో కార్మికులు కేవైసీ చేయించుకోపోతే జీతాలు రావని బెదిరింపు చర్యలకు దిగుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ గౌరవాధ్యక్షుడు చీకటి శ్రీనివాసరావు, సిఐటియు నగర అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్.రాంబాబు, టి.మహేష్, శ్రీరామ శ్రీనివాసరావు, కె.సామ్రాజ్యం, రత్నకుమారి శ్రీదేవి పాల్గొన్నారు



కె.సుబ్బ రాయుడు



కొర్నెపాటి శ్రీనివాసరావు

అభివృద్ధికి దూరంగా ఆటోనగర్

- బాపట్ల జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా ఏర్పాటుతో చీరాల, బాపట్ల భవిష్యత్‌లో జంట నగరాలుగా అభివృద్ధి చెందుతాయని భావిస్తున్నారు. ఈ రెండు పట్టణాల మధ్యలో దీర్ఘకాలంగా అభివృద్ధి నోచని చీరాల ఆటోనగర్ ఉంది. దీన్ని అభివృద్ధి చేయడం ద్వారా ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. చీరాలలో ఆటోనగర్ ఏర్పాటు రెండున్నర దశాబ్దాల కల. నియోజకవర్గ కేంద్రంగా ఉన్న చీరాల వస్త్రవ్యాపారంలో చినబొంబాయిగా పేరు గాంచింది. పేరు పొందిన ఐటిసి కంపెనీ, నూలు మిల్లు,ఆగ్రో కంపెనీలు ఉన్నాయి. పర్యాటక పరంగా మంచి పేరు ఉంది. వ్యాపార పరంగా అభివృద్ధి చెందుతున్న దశలో చీరాలకు వందలాది వాహనాలు, టాన్స్‌పోర్టు లారీల తాకిడి పెరిగింది. దీంతో ఆటోమొబైల్ షాపులు, మరమ్మత్తుల షెడ్లు ఏర్పాటు చేశారు. చీరాల పట్టణంలో రద్దీ, కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో చీరాల,బాపట్ల పట్టణాల మధ్య ఈపురుపాలెం శివార్లలో ఆటోనగర్ ఏర్పాటుకు 1994లో టిడిపి ప్రభుత్వ హయాంలో బీజం పడింది.మాజీ మంత్రి డాక్టర్ పాలేటి రామారావు చీరాల ఎమ్మెల్యే ఉన్న సమయంలో 2000 సంవత్సరంలో అప్పటి హోంమంత్రి దేవేంద్రగౌడ్ ఆటోనగర్‌కు శంకుస్థాపన చేశారు.

47 ఎకరాల్లో ఆటోనగర్

చీరాల సమీపంలోని బాపట్ల రోడ్డులో ఎపిఐఐసి వారు 47 ఎకరాలు సేకరించి 464 ప్లాట్లు వేశారు. చీరాల పట్టణానికి చెందిన 422 మంది రూ.2,500 చొప్పున చెల్లించి ప్లాట్ల కోసం తమ పేర్లను నమోదు చేయించుకున్నారు. తర్వాత ఆటోనగర్ అభివృద్ధికి ఎలాంటి నిధులు మంజూరు కాలేదు. పాలకులు, అధికారులు ఆటోనగర్ గురించి పట్టించుకోలేదు. ఆటోనగర్ కార్యరూపం దాల్చలేదు. కోర్టు కేసులు కూడా దీనికి తోడయ్యాయి. అన్ని అవాంతరాలు తొలగి చివరికి 2018లో ఆటోనగర్ లో అంతర్గత రహదారులు,విద్యుత్,ఇతర మౌళిక సదుపాయాల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. రూ.5.60 కోట్లతో తారు రోడ్లు నిర్మించారు. విద్యుదీకరణ పనుల కోసం రూ. 57.78 లక్షలు కేటాయించారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి ఇతర విద్యుదీకరణ పనులు పూర్తి చేశారు.

నూతన పారిశ్రామిక విధానంలో భాగంగా ఆటోనగర్‌లో ఎవరికి ప్లాట్లను శాశ్వతంగా రిజిస్ట్రేషన్ చేయరు. 30 సంవత్సరాల పాటు లీజుకు మాత్రమే ఇస్తారు. ప్లాట్లను పొందినవారు అక్కడ తమ యూనిట్‌ను స్థాపించి విజయవంతంగా కొనసాగిస్తే 10 సంవత్సరాల తరువాత రిజిస్ట్రేషన్ చేస్తారు. అందుకు అటోనగర్ సభ్యులు సుముఖంగా లేరు. ఇక్కడ ఏర్పాటు చేసిన ప్లాట్లు 2 నుంచి 4 సెంట్లు విస్త్రీరణం కలిగి ఉన్నారు. సభ్యులందరూ చిన్నతరహా యూనిట్లు పెట్టుకుని జీవనం సాగించేవారే. ప్రభుత్వం భావిస్తున్నట్లుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు లేరు. ఈ నేపథ్యంలో ప్లాట్లను తమ పేరుతో రిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్నారు. తాము 20 ఏళ్ళ క్రితం ఆటోనగర్‌లో సభ్యులుగా చేరామని అప్పుడే తమకు ప్లాట్లను అప్పజెప్పినట్లయితే సెంటు రూ.5 వేల ధరలో వచ్చేదని ఇప్పుడు సెంటు రూ.1 లక్ష వరకు ఉంటుందని ఇది తమకు ఆర్థిక భారం అంటున్నారు.లీజు విధానం కాకుండా ప్లాట్లన ఎరిజిస్ట్రేషన్ చేయాలని కోరుతున్నారు. ప్రస్తుత నిబంధనలు ఇందుకు అనుకూలంగా లేకపోవడంతో ఎపిఐఐసి అధికారులు కోరిన విధంగా దాదాపు 100 మంది వరకు యూనిట్ల స్థాపన కోసం ఒక్కోక్కరు సెంటుకు రూ.1 లక్ష చొప్పున ప్లాట్ విస్తీర్ణాన్ని బట్టి రూ.4 లక్షల వరకూ చెల్లించారు. సదరు భూమి ఎపిఐఐసికి ప్రభుత్వం నుంచి బదలాయింపు జరగకపోవడంతో సభ్యులకు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. నగదు కోసం లబ్ధిదారులు ఎదురు చూస్తున్నారు.

ఆటోనగర్‌తో బాపట్ల జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి

చీరాల ఆటోనగర్ పూర్తి స్థాయిలో కార్యరూపం దాల్చితే ఈ ప్రాంతం పారిశ్రామికంగా ముందడుగు వేస్తుందని భావిస్తున్నారు. ఇక్కడ ఉన్న 464 ప్లాట్లలో చిన్నచిన్న యూనిట్లు ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.ప్రధానంగా మోటారు రంగం అభివృద్ధి చెందుతుంది. వివిధ రకాల ఆటోమొబైల్ సేవలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయి. కొత్త యూనిట్లు, షాపులు ఏర్పాటైతే వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. వేలాది మందికి ఉపాధికి కలుగుతుంది. బాపట్ల,చీరాల మధ్యలో చిన్నపాటి పారిశ్రామిక వాడ ఏర్పడుతుంది. కాలుష్యం తగ్గి, ట్రాఫిక్ ఇబ్బందులు కొంత మేర తీరుతాయి.



చీరాల ఆటోనగర్ ఇదే..





మాట్లాడుతున్న పీడీ బాబూరావు

స్వయం సహాయక సంఘాలకు

ఆదాయ వనరుగా మహిళా మార్ట్

రాష్ట్ర చేయూత మహిళా మార్ట్ అడిషనల్ డైరెక్టర్ మహిత

ప్రజాశక్తి-మద్దిపాడు

స్వయం సహాయక సంఘాలకు ఆదాయ వనరుగా మహిళా మార్ట్‌లు ఉపయోగ పడతాయని రాష్ట్ర చేయూత మహిళ మార్ట్ అడిషనల్ డైరెక్టర్ మహిత తెలిపారు. స్థానిక వైఎస్‌ఆర్‌కెపి, డిఆర్‌డిఎ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిత మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు, నిత్యవసర వస్తువులు చేయూత మహిళా మార్ట్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. మహిళా మార్ట్‌ను అభివద్ధి పథంలో నడిపేందుకు మహిళా కమిటీ సభ్యులు నిబద్ధతతో పనిచే యాలన్నారు. డిఆర్‌డిఎ, వైఎస్‌ఆర్ క్రాంతి పథకం ప్రాజెక్టు డైరెక్టర్ బి. బాబూరావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన అన్ని రకాల ఉత్పత్తులను ఈ మహిళా మార్ట్‌లో అందులో బాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎం సునీత, ఎపిఎం నరేంద్ర కుమార్, చేయూత ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ శ్రీనివాస్‌రెడ్డి, ఏరియా కోఆర్డినేటర్ విజయమ్మ, చేయూత డిపిఎం సునీత, మండల సమైక్య అధ్యక్ష ఎరాలు సిహెచ్.దివ్య వాణి, కోమలి, నాగేంద్ర, మహిళా మార్ట్ కమిటీ సభ్యులు కేజియా, జ్యోతి, సిసిలు, విఒఎలు పాల్గొన్నారు.

27న మండల సమావేశం

ప్రజాశక్తి-కొండపి

మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 27న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ తెలిపారు. ఎంపిపి కె. స్వప్న అధ్యక్షతన నిర్వహిస్తున్న సమావేశానికి మండల పరిధిలోని అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఎంపిడిఒ తెలిపారు సమావేశంలో వివిధ శాఖల పనితీరుపై సమీక్షించనున్నట్లు ఆయన తెలిపారు. అధికారులు తగు సచారంతో సమావేశానికి రావాలన్నారు.